సాక్షి
అనంతపురం
ఆదివారం । 23 । జూలై । 2023



చీనీ టన్ను రూ.19,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19,500 పలికాయి. మార్కెట్‌కు 835 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.94
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.94 పలికింది. కనిష్టం రూ.53, సరాసరి రూ.75 ప్రకారం క్రయవిక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
32.8°/22.5°
జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయంలోకి చేరిన నీరు

బొమ్మనహాళ్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో నదులు, జలాశయాలు జలకళ సంతరించుకుంటున్నాయి. తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతోంది. శివమొగ్గ జిల్లా పరిధిలోని తుంగా జలాశయం నుంచి 19,506 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తుండడంతో ఆ నీరంతా తుంగభద్ర జలాశయానికి చేరుతోంది. శనివారం ఉదయానికి 34,071 క్యూసెక్కులకు పైగా వరద నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. 20వ తేదీన 9,536 క్యూసెక్కులు, 21న 13,340 క్యూసెక్కులు వస్తూ ఒకేసారి 34,071 క్యూసెక్కులకు నీరు పెరిగింది. దీంతో డ్యాంలో మొత్తం నీటి నిల్వ 16.649 టీంఎసీలకు చేరింది. ఇదిలాగా కొనసాగితే ఆగస్టు మొదటి వారంలోపే జలాశయం పూర్తి స్థాయిలో నిండే అవకాశం ఉందని బోర్డు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థుల చేతుల్లో సెమిస్టర్-2 పుస్తకాలు



సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలతో శింగనమల కేజీబీవీ విద్యార్థినులు

రాప్తాడురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1–9 తరగతుల విద్యార్థులకు సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని స్కూళ్లలోనూ ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో మొత్తం 1,751 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. మండల విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంల చేతుల మీదుగా సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. జిల్లాకు మొత్తం 5,88,377 పాఠ్యపుస్తకాలు వచ్చాయి. వీటిలో అమెజాన్ సంస్థ ద్వారా 22 స్కూళ్లకు 1,140 పుస్తకాలను ఇటీవలే పంపిణీ చేశారు. తక్కినవన్నీ ఆయా మండలాలకు మూడు రోజుల కిందటే పంపారు. అక్కడి నుంచి ఎండీయూ వాహనాల ద్వారా స్కూళ్ల పాయింట్లకు తరలించారు. స్కూళ్లలో శనివారం విద్యార్థులకు అందజేశారు.

'వైఎస్సార్' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం కల్చరల్: వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్స్ అవార్డు–2023, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కళలు, సామాజిక పని, పబ్లిక్ అఫైర్స్, సైన్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్‌అండ్ ఇండస్ట్రీ, మెడిసిన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీస్, స్పోర్ట్స్ రంగాల్లో రాణించిన వ్యక్తులు, గ్రామ, మురికివాడల్లో మంచి పనులు చేసి రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకున్న వారు, రాజకీయ, ఎన్‌జీఓ, లాభాపేక్ష లేని సంస్థలు, చారిత్రక స్వభావం కలిగిన సంస్థలు కాల పరీక్షలో నిలిచిన సంస్థలు దరఖాస్తుకు అర్హులని వివరించారు. కేటగిరి వారీగా ఆగస్టు 31లోగా దరఖాస్తు చేయాలని, మరిన్ని వివరాలకు ఆన్‌సెట్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రంలో మంత్రి ఉషశ్రీ చరణ్, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే పెద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు



తాడిపత్రి నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి హాజరైన అధికారులు

- అధికారులందరి కృషితోనే అది సాధ్యం
- ప్రభుత్వ పథకాలు అర్హులకందాలి
- తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి

తాడిపత్రి: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని, వారి అవసరాలు తీర్చే విధంగా అధికార యంత్రాంగం కృషి చేయాలని, తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. శనివారం మంత్రి పెద్దిరెడ్డి అధ్యక్షతన పట్టణంలోని ఏఎస్‌ఆర్ గార్డెన్స్‌లో తాడిపత్రి నియోజకవర్గ స్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారదర్శక పాలనలో భాగంగా అన్ని నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగానే ఆయా నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సహాయ సహకారాలను అధికారులు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అక్రమాలకు తావు లేకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో ఉన్నతాధికారులు, స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు చర్చలు జరిపి, అభివృద్ధి పనుల విషయంలో రాజీపడకుండా పూర్తి చేసేందుకు సహకరించాలని మంత్రి సూచించారు. నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మంత్రి ఉషశ్రీ చరణ్, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య అన్నారు. నవరత్నాల పథకాలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు.

పనుల్లో జాప్యం వద్దు..
పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాలు, ఆర్బీకేలు వంటి నిర్మాణ పనుల్లో జాప్యం చేయవద్దని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. 'నాడు – నేడు' కింద పాఠశాలల్లో చేపట్టే పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించరాదన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

సంక్షేమ పథకాల ఫలాలు అర్హుల దరి చేర్చడంలోను, అభివృద్ధి పనులు చేపట్టడంలోనూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సూచించారు. తాడిపత్రి పట్టణంలోని పాత కోట వద్ద హెల్త్ సెంటర్ పనులు చేపట్టకుండానే నిర్మాణం పూర్తి కావస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రగతి నివేదికలో పొందుపరచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలు మాత్రమే చెప్పాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రవి జోక్యం చేసుకుని త్వరలోనే పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు. వైఎస్ జగన్ పాలనలో అభివృద్ధి – సంక్షేమం పరుగులు పెడుతోందన్నారు. అయితే తాడిపత్రి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రతిపక్ష టీడీపీ నేతలు అడుగడుగునా అడ్డుపడుతున్నారన్నారు. అధికారులు సరైన నిర్ణయం తీసుకుని.. అభివృద్ధికి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. పట్టణ ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చే అమృత్ స్కీం మధ్యలోనే ఆగిందన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు పనుల కోసం నిధులు మంజూరుకాకుండా అడ్డు తగిలారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ తరఫున 15 పనులకు గాను రూ.24.21 కోట్లు అవసరమవుతాయన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 9 పనులకు గాను రూ.3.45 కోట్లు, ఆర్‌అండ్‌బీ ద్వారా నూతన రోడ్లు, రిపేరీ వంటి 5 పనులకు గాను రూ.125.88 కోట్లు, హెచ్‌ఎల్‌సీ మరమ్మతులతో పాటు ఇతర పనులకు గాను రూ.2.12 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. అధికారులు త్వరితగతిన ఆయా పనుల పూర్తికి సహకరిస్తే తాడిపత్రిలో గతంలో జరగని అభివృద్ధిని ఇప్పుడు చేసినవారమవుతామని అన్నారు.

కేజీబీవీల్లో ఖాళీ సీట్ల భర్తీ

- 6 – 9 తరగతుల్లో 183 సీట్లను భర్తీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు
- ఎంపికైన విద్యార్థినులకు సమాచారం ఇవ్వని స్పెషల్ ఆఫీసర్లు

రాప్తాడు రూరల్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) 6 – 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లంటినీ భర్తీ చేశారు. మొత్తం 32 కేజీబీవీల్లో 183 సీట్లను భర్తీ చేశారు. అనాథ, పేద విద్యార్థినులకు అవకాశం కల్పించారు. ఈ మేరకు సమగ్రశిక్ష చైర్‌పర్సన్/ కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపిక చేసిన విద్యార్థినుల జాబితాలను ఆయా కేజీబీవీలకు పంపారు. వెంటనే విద్యార్థినులకు సమాచారం అందించి అడ్మిషన్లు చేసుకోవాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్, డీఈఓ సాయిరామ్ ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజుల కిందటే జాబితాలు కేజీబీవీలకు వెళ్లాయి. శనివారం జీసీడీవీ వాణీదేవి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, జాబితాలో ఉన్న విద్యార్థినులకు సమాచారం అందించాలని సూచించారు. కాగా దేవుడు వరం ఇచ్చినా పూజారి కరుణించడం లేదన్న చందంగా తయారైంది కొందరి విద్యార్థినుల పరిస్థితి. కేజీబీవీల్లో ఖాళీ సీట్ల భర్తీకి సమగ్ర శిక్ష అధికారులు సుదీర్ఘంగా కసరత్తు చేసి కలెక్టర్‌తో పలుమార్లు చర్చించి ఖరారు చేయించారు. అయితే కొందరు ఎస్‌ఓలు మాత్రం నేటికీ సమాచారం చేరవేయలేదు. కేజీబీవీల నుంచి ఫోన్లు వస్తాయని విద్యార్థినులు, బంధువులు ఎదురు చూస్తున్నారు. ఈ విషయంపై డీఈఓ సీరియస్ అయ్యారు. ఎంపికైన విద్యార్థినులకు స్వయంగా ఫోన్లు చేసి సమాచారం అందజేసి వెంటనే చేర్చుకునేలా చూడాలన్నారు. నిర్లక్ష్యం ప్రదర్శించి... ఫిర్యాదులు అందితే మాత్రం కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఓలను హెచ్చరించారు.

కావలసినంత 'కాంప్లెక్స్'

- ఎన్‌పీకే కలిగిన కాంప్లెక్స్ ఎరువులు 28 వేల మెట్రిక్ టన్నులు
- యూరియా, డీఏపీ, పొటాష్‌లు తగినంత అందుబాటులో
- ప్రస్తుతానికి అన్ని రకాల ఎరువులు 52 మెట్రిక్ టన్నుల నిల్వ



అనంతపురం అగ్రికల్చర్: పంటల ఎదుగుదల, దిగుబడుల్లో కీలకపాత్ర పోషించే పోషకాల్లో నత్రజని, భాస్వరం, పొటాష్ (ఎన్–పీ–కే) ఎరువులు ముఖ్యమైనవి. ఇందుకోసం రైతులు యూరియా, డై అమ్మోనియం పాస్ఫేట్ (డీఏపీ), మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ) సింగిల్ సూపర్ పాస్ఫేట్ (ఎస్‌ఎస్‌పీ)తో పాటు మరికొన్ని నీటిలో కరిగే ఎరువులను వివిధ రూపాల్లో పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. వీటిని విడివిడిగా వాడుతుండటంతో కొన్నింటికి తరచూ డిమాండ్ ఏర్పడుతోంది. దీని వల్ల రైతులకు ఇబ్బందిగా మారింది. అయితే ఎన్–పీ–కే పోషకాలు తగినంత మోతాదులో కలగలిపినవి ఒకే బస్తాలో ఉన్నవాటిని కాంప్లెక్స్ ఎరువులుగా పిలుస్తారు. ఇపుడు కాంప్లెక్స్ ఎరువులకు డిమాండ్ ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా వీటికి ప్రాధాన్యత ఇస్తోంది. ఈ క్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు కూడా పెద్ద ఎత్తున కాంప్లెక్స్ ఎరువులు తెప్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ రకం ఎరువులు కావల్సినంత అందుబాటులో ఉండటంతో రైతులకు ఇబ్బంది లేకుండాపోయింది.

1.10 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు..
ఈ ఖరీఫ్‌లో 1.10 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమని ప్రణాళిక రూపొందించారు. అందులో అత్యధికంగా 38,690 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్‌లు, యూరియా 36,600 మెట్రిక్ టన్నులు, డీఏపీ 16,254 మెట్రిక్ టన్నులు, 9,324 మెట్రిక్ టన్నులు సింగిల్ సూపర్ పాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ), 8,370 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ), మరో 330 మెట్రిక్ టన్నుల కంపోస్టు ఎరువులు కేటాయించారు. ఇందులో ఏప్రిల్ నెలలో 14,252 మెట్రిక్ టన్నులు, మే నెలలో 5,979 మెట్రిక్ టన్నులు, జూన్‌లో 12,415 మెట్రిక్ టన్నులు, జూలైలో 21,031 మెట్రిక్ టన్నులు, ఆగస్టులో 28,140 మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్‌లో 28,751 మెట్రిక్ టన్నులు... ఇలా నెలవారీగా వివిధ కంపెనీల నుంచి సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు.

28 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్‌లు..
20–20–0–13, 26–26–26, 12–32–16, 29–29–0, 14–35–14... ఇవన్నీ కాంప్లెక్స్ ఎరువులుగా పరిగణిస్తారు. వీటిలో నత్రజని, భాస్వరం, పొటాష్ కలిగిన పోషకాలు తగిన మోతాదులో ఉంటాయి. ఇలాంటి ఎరువులు ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 28 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి.

- వీటితో పాటు 12 వేల మెట్రిక్ టన్నులు యూరియా, 7 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, 4 వేల మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 1,500 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ ఉండగా మరికొన్ని కంపోస్టులు ఎరువులు ఉన్నాయి. ప్రస్తుతం 52 వేల మెట్రిక్ టన్నులకు పైగా అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయి.
- మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ ద్వారా ఆర్‌బీకేలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లకు ప్రాధాన్యత ఇస్తూనే ఇండెంట్ ప్రకారం హోల్‌సేల్, రిటైల్ డీలర్లకు సరఫరా చేస్తున్నారు. అత్యవసరం కోసం కంపెనీ గోదాములు, మార్క్‌ఫెడ్ దగ్గర బఫర్‌స్టాక్ పెడుతున్నట్లు డీఏఓ ఉమామహేశ్వరమ్మ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి తెలిపారు.

పల్లె.. పిచ్చి చేష్టలు మానుకో



ఓడీ చెరువులో పల్లె రఘునాథరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అమడగూరు/ఓడీచెరువు/నల్లమాడ/ పుట్టపర్తి: మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిచ్చి చేష్టలు మానక పోతే ఊరుకునేది లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై పల్లె చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం ఓడీ చెరువు, నల్లమాడ, పుట్టపర్తిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. పల్లె రఘునాథరెడ్డి శవయాత్ర, దిష్టిబొమ్మల దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ రాజకీయాలు వేరు, వ్యాపారాలు వేరనే విషయాన్ని 'పల్లె' గుర్తుంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే తన ఆస్తులను తనఖాగా చూపించి రుణాలను తీసుకున్నాడని, పల్లె రఘునాథరెడ్డి లా విద్యార్థుల కడుపు కొడుతూ, ఫీజులు కొల్లగొడుతూ, దొంగ డీడీలు, దొంగ చెక్‌లు ఇస్తూ మోసం చేయలేదని విమర్శించారు. 'చిల్లర రాజకీయాలు మానుకోకపోతే పల్లెవాండ్లపల్లికి తరిమి కొడతాం.. తస్మాత్ జాగ్రత్త' అంటూ హెచ్చరించారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేక పచ్చ మీడియాతో కలిసి కుట్రలు చేస్తున్న రఘునాథరెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తే వచ్చే ఎన్నికల్లో ఓటర్ల ఆగ్రహానికి గురికాక తప్పదని స్పష్టం చేశారు.

కొలువుదీరిన కుళ్లాయిస్వామి



నార్పల: గూగూడు బ్రహ్మోత్సవాల్లో శనివారం కుళ్లాయిస్వామి పీర్లు కొలువుదీరాయి. స్వామి వారిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి సన్నాయి వాయిద్యాల నడుమ తెల్లవారుజాము మూడు గంటల సమయంలో అర్చకులు హుసేనప్ప పీర్లను మకానంలో కొలువుదీర్చారు. చక్కెర చదివింపులు చేశారు. స్వామి దర్శన భాగ్యం కోసం రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కుళ్లాయిస్వామిని దర్శించుకున్న భక్తులు పక్కనే ఉన్న ఆంజనేయస్వామికి కూడా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, ఈఓ శోభ, కో ఆప్షన్ మెంబర్ షాబీరా, ఎంపీటీసీ సభ్యుడు రాజారెడ్డి, నాయకులు గోపాల్, శివయ్య పాల్గొన్నారు.

ఉత్సవాల్లో ఏ రోజు ఏమంటే..
23న స్వామి వారి నిత్యపూజ నివేదన, 24న ఐదవ సరిగెత్తు, 25న నిత్యపూజ నివేదన, 26న ఏడవ చిన్న సరిగెత్తు, రాత్రికి దేవుని మెరవణి, 27న నిత్యపూజ నివేదన, విడిదినం, 28న పెద్ద సరిగెత్తు, స్వామి వారి గ్రామోత్సం, 29న అగ్ని గుండ ప్రవేశం, గ్రామోత్సం, సాయంత్రం 4 గంటలకు జలధి నిర్వహిస్తారు. 31న స్వామి వారి చివరి దర్శనం ఉంటుంది.

క్లుప్తంగా

సమాజ సేవలో ముందుండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్

అనంతపురం: సమాజసేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని జిల్లా న్యాయమూర్తి జి. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. న్యాయసేవా అధికార సంస్థ సేవలపై వివిధ శాఖల ప్రభుత్వ అధికారులకు న్యాయ సేవా సదన్‌లో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. న్యాయ సేవా అధికార చట్టంలోని సెక్షన్-22బి కింద శాశ్వత లోక్‌అదాలత్‌లు దేశ వ్యాప్తంగా ఏర్పడ్డాయని, వీటిలో ఫిర్యాదు దాఖలు చేయడానికి ఎలాంటి కోర్టు ఫీజు, రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. ఇరుపక్షాల మధ్య సామరస్య పరిష్కారానికి సహకరించని పక్షంలో అందుబాటులో ఉన్న ఆధారాల మూలంగా అప్పీలుకు ఆస్కారం లేని శాశ్వత పరిష్కారంగా తీర్పు వెలువరించగల అధికారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.దీనబాబు, ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్‌అదాలత్ ధర్మాసనం చైర్మన్, న్యాయమూర్తి కె.శ్రీనివాసరావు, సభ్యులు ఎం.రాజశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన సీసీఐ సభ్యుడు

బెళుగుప్ప: స్థానిక పోలీసుస్టేషన్‌ను క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సభ్యుడు బాలచంద్ర శనివారం పరిశీలించారు. ప్రజలకు అందజేస్తున్న సేవలపై ఆరా తీశారు. రికార్డుల నిర్వహణ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ స్థాయి ఉత్తమ పోలీస్ స్టేషన్ల గుర్తింపు ర్యాంకింగ్ కోసం తాము దేశమంతటా పర్యటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సీఐ శేఖర్, ఎస్ఐ రామకృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

1.67 లక్షల కొత్త కార్డులు

- సెప్టెంబర్ నుంచి గ్రామీణ ప్రాంతాల్లో గోధుమపిండి పంపిణీ
- రాయలసీమ తరహాలో ఉత్తరాంధ్రలోనూ రాగుల పంపిణీ
- రైతు నుంచి మద్దతు ధరకు కంది కొనుగోలు చేసి కార్డుదారులకు అందిస్తాం
- రాష్ట్ర వ్యాప్తంగా 'జగనన్న సురక్ష' విజయవంతం
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్



రాయదుర్గంలో జగనన్న లేఔట్‌లో పూర్తయిన ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ్‌కుమార్

రాయదుర్గం/ రూరల్/కళ్యాణదుర్గం: రాష్ట్రంలో 1.67 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్, జగనన్న సురక్ష అనంతపురం జిల్లా నోడల్ అధికారి అరుణ్‌కుమార్ వెల్లడించారు. ఆయన శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. రాయదుర్గంలోని బీటీపీ రోడ్డు జగనన్న కాలనీలో కొత్తగా నిర్మించిన ఇళ్లను, డి.కొండాపురం సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ గోదామును, 74 ఉడేగోళం సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని గూబనపల్లి లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. భవిష్యత్తులో జగనన్న కాలనీల్లో తామెందుకు లేకపోయామనే ఫీలింగ్ ఇతరులకు కలిగేలా తీర్చిదిద్దుతామన్నారు. 'జగనన్నకు చెబుదాం' అర్జీలు, 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో 11 రకాల ఉచిత సేవలపై ఆరా తీశారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో సరికొత్త మార్పులు..

ప్రజా పంపిణీ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టిందని కమిషనర్ అరుణ్‌కుమార్ తెలిపారు. రాయదుర్గంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.46 కోట్ల కుటుంబాలకు ప్రతి నెల 2.11 లక్షల టన్నుల బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఇందుకోసం ప్రతి నెల రూ.846 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. దీనికితోడు మరో 1.67 లక్షల కొత్త రేషన్ కార్డులు అర్హులకు అందించేందుకు కార్యాచరణ పూర్తయిందన్నారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా బియ్యంతో పాటు రాయలసీమ జిల్లాల్లో రాగులు, జొన్నల పంపిణీ ప్రతిష్టాత్మకంగా చేపట్టామన్నారు. ఉత్తరాంధ్రలోనూ సెప్టెంబర్ నుంచి రాగులు అందిస్తామన్నారు. ఈ నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్బన్ ప్రాంతాల్లో కిలో రూ.16తోనే గోధుమ పిండి పంపిణీ చేస్తున్నామన్నారు. వచ్చే నెల నుంచి గ్రామీణ ప్రాంతాల్లోనూ పంపిణీ చేపడతామన్నారు. మన రాష్ట్రంలో పండించిన వరి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేసి, నాణ్యమైన బియ్యం తయారుచేసి కార్డుదారులకు సరఫరా చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కంది నిల్వలు తగ్గిపోవడం కారణంగా సరఫరాలో కొంత జాప్యం ఏర్పడిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మన రాష్ట్రంలో పండిన కందిని మనమే మద్దతు ధరతో కొనుగోలు చేసి మిల్లింగ్ చేపట్టాక కార్డుదారులకు అందించాలని నిర్ణయించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష టన్నుల దాకా కంది అవసరమన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటనలో జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి శోభారాణి, జిల్లా మేనేజర్ నీలమయ్య, కళ్యాణదుర్గం ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, రాయదుర్గం మునిసిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతి, ఏడీ లక్ష్మానాయక్, ఎంపీడీఓ కొండయ్య, ఎంఈఓ నాగమణి, పీఆర్ జేఈ మునయ్య, ఏఓ మహేంద్ర, సర్పంచ్ దురుగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీపై ఆరా..

బెళుగుప్ప: హనిమిరెడ్డిపల్లిలోని 33వ నంబరు చౌక ధాన్యపు దుకాణాన్ని పౌర సరఫరాల కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. తొలుత ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజన పథకం కింద సరఫరా అవుతుతున్న నిత్యావసర సరుకులను పరిశీలించి, ఎంఈఓ మల్లారెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చౌకధాన్యపు దుకాణం వద్దకెళ్లి స్టాకు వివరాల గురించి డీలర్ రజియాబీతో, రేషన్ సరుకుల పంపిణీపై కార్డుదారులతో ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబులేసు, ఏఓ పృథ్వీసాగర్, సర్పంచ్ మారుతమ్మ పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎస్ఆర్ఐటీ గ్రాడ్యుయేషన్ డే

- 433 మందికి పట్టాలు పంపిణీ





కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, పట్టా అందజేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి (చిత్రంలో) ఆలూరి సాంబశివారెడ్డి, వీసీ రంగ జనార్దన, తదితరులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే శనివారం అట్టహాసంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి, జేఎన్‌టీయూ(ఏ) వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్దన, ఎస్ఆర్ఐటీ కళాశాల అడ్వైజర్ డాక్టర్ ఈఎస్ చక్రవర్తి, కళాశాల కరస్పాండెంట్, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. కష్టపడి చదివితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరరం కళాశాలలో విద్యనభ్యసించిన 433 మంది పట్టభద్రులకు పట్టాలు పంపిణీ చేశారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో విద్య, ఎలక్ట్రికల్‌లో యర్రగుంట్ల లయ, మెకానికల్ ఇంజినీరింగ్‌లో ధూర్జటి కృష్ణమనోహర్, ఎలక్ట్రానిక్స్‌లో మేఘన, కంప్యూటర్ సైన్స్‌లో పవన్ కళ్యాణ్ బంగారు పతకాలు అందుకున్నారు. అత్యధిక మార్కులు సాధించిన కృష్ణ మనోహర్‌కు ఆలూరి సుంకిరెడ్డి స్మారక, లయకు ఆలూరి నారాయణమ్మ స్మారక అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి కళాశాలకు అటానమస్ తప్పని సరి

బుక్కరాయసముద్రం: రాబోవు రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి ఇంజినీరింగ్ కళాశాల స్వయం ప్రతిపత్తి (అటానమస్)ని కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఉన్నతి విద్యామండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచందారెడ్డి అన్నారు. బుక్కరాయసముద్రం మండలం రోటరీపురంలోని ఎస్ఆర్ఐటీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడికి వెళుతున్న ప్రతి ఒక్కరికీ ఉన్నత విద్యను అందజేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలో ప్రతి ఇంజినీరింగ్ కళాశాల అటానమస్ న్యాక్‌గ్రేడ్ తప్పని సరిగా కలిగి ఉండాలన్నారు. కళాశాలను స్థాపించిన 14 ఏళ్ల వ్యవధిలోనే ఎంబీకే అక్రిడిటేషన్‌తో పాటు అటానమస్ పొందిన ఎస్ఆర్ఐటీ యాజమాన్యాన్ని అభినందించారు.

జెడ్పీ ఉద్యోగులకు పదోన్నతులు



పదోన్నతుల ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ భాస్కర్‌రెడ్డి

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ యాజమాన్యం కింద పని చేస్తున్న ఏడుగురు ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. జెడ్పీ సహా ఉమ్మడి జిల్లాలోని అనుబంధ విభాగాల్లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు చంద్రశేఖర్‌రెడ్డి (రొద్దం), వరదరాజ ప్రసాద్(రామగిరి), నాగరాజు (చెన్నేకొత్తపల్లి), విజయభాస్కర్‌రెడ్డి (అనంతపురం), శ్రీనివాసరెడ్డి (అనంతపురం), ఆర్‌వీవీజీఎం ప్రసాద్ (రొళ్ల), లక్ష్మీశంకర్ (కుందుర్పి)ను పరిపాలనాధికారులుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ శనివారం ఉతర్వులు అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక..

జిల్లా పరిషత్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అడ్‌హక్ విధానంలో ఏర్పాటైన కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా భరత్‌కుమార్, కార్యదర్శిగా ప్రసాద్, కోశాధికారిగా ఎస్ఏ రహీం, అసోసియేట్ అధ్యక్షుడిగా నారాయణ, ఉపాధ్యక్షులుగా రామాంజినప్ప, ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా ఇస్మాయిల్‌తో పాటు కో-ఆప్షన్ సభ్యులుగా జగన్నాథ్, రెడ్డెప్ప, చైతన్యను ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్నకుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం నూతన సభ్యులందరూ శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను ఆమె క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

సీజనల్ వ్యాధులపై సర్వే చేయండి

- డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్



నీటి ట్యాంకును పరిశీలిస్తున్న డాక్టర్ యుగంధర్

ఆత్మకూరు: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించి సర్వే పకడ్బందీగా చేపట్టాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ ఆదేశించారు. ఆత్మకూరు మండలం తలుపూరులో శనివారం ఆయన పర్యటించారు. మలేరియా, డెంగీ, తదితర విషజ్వరాలు వ్యాపించకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్య పరిచారు. ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద కంటి నిపుణల చేత పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్సలు అవసరమైన వారికి సర్వజనాస్పత్రిలో చికిత్సలకు సిఫారసు చేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రీ-సర్వే వేగవంతం

అనంతపురం అర్బన్: జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం కింద జిల్లాలో రీ-సర్వే వేగవంతం చేసినట్లు సర్వే, భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. మొదటి దశలో 61 గ్రామాల్లో రీ-సర్వే ప్రక్రియ పూర్తి కాగా, రెండో దశ కింద ఇప్పటి వరకూ 18 గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. మరో 39 గ్రామాల్లో సర్వే జరుగుతోందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా జిల్లావ్యాప్తంగా రీ-సర్వే పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి భూహక్కు పత్రాలు రాగానే సంబంధిత యజమానులకు అందజేస్తామన్నారు. గుత్తి మండలం తురకపల్లి, గార్లదిన్నె మండలం ఓబుళాపురం, కళ్యాణదుర్గం మండలం బ్యాడరహళ్లి (గ్రామకంఠం)లో 13 నోటిఫికేషన్‌లు ఇచ్చినట్లు వివరించారు.

సజావుగా అంగన్‌వాడీ కార్యకర్తల ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం రూరల్: జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు రెవెన్యూడివిజన్ల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూలు సజావుగా సాగాయి. అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో చేపట్టిన ఈ ప్రక్రియను ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ గాయత్రీదేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పర్యవేక్షించారు. అభ్యర్థుల విద్యార్హత పత్రాలను పరిశీలించారు. మూడు డివిజన్ల పరిధిలో మూడు కార్యకర్త పోస్టులకు 17 మంది, 36 ఆయా పోస్టులకు 89 మంది హాజరయ్యారు. ఆర్డీఓ మధుసూదన్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సీడీపీఓలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల జిల్లా కన్వీనర్ మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశానికి మిగులు సీట్లకు ఈ ఏడాది మేలో పదో తరగతిలో 360కు పైబడి మార్కులతో రెగ్యులర్ పాసైన విద్యార్థులు అర్హులు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేదీ లోపు ఆయా కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారి మెరిట్‌ను బట్టి ఈ నెల 27న సీట్లు కేటాయిస్తారు. పూర్తి వివరాలకు సంబంధిత గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించవచ్చు.

ఎరువుల తయారీలో నాణ్యత పాటించండి



ఎరువులను పరిశీలిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరి

శింగనమల: రసాయనిక ఎరువుల తయారీలో నాణ్యత పాటించాలని నిర్వాహకులను జేడీఏ ఉమామహేశ్వరి ఆదేశించారు. శింగనమల మండలం చక్రాయిపేట వద్ద ఉన్న స్వర్ణభూమి ఎరువుల తయారీ కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఎరువుల తయారీ, రికార్డులు, స్టాక్ పరిశీలించారు. ఎరువుల శాంపుల్స్ తీసి ల్యాబ్‌కు పంపాలని ఏఓ అన్వేష్‌కుమార్‌కు సూచించారు. తనిఖీలో టెక్నికల్ ఏఓ బాలానాయక్ పాల్గొన్నారు.

మృతుడు అనంతపురం వాసి

మడకశిర: స్థానిక మధుగిరి సర్కిల్‌లో విషం తాగి మృతి చెందిన వ్యక్తిని అనంతపురానికి చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. నిరుపయోగంగా ఉన్న ఓ భవనంలో శుక్రవారం ఓ మహిళ, వ్యక్తి విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని తక్షణమే వారిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు మృతుడి ఫొటోను ఉమ్మడి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపి ఆరా తీశారు. దీంతో మృతుడు అనంతపురంలోని పాతూరుకు చెందిన తిప్పేస్వామిగా ఆచూకీ లభ్యమైంది. అలాగే హిందూపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళను పద్మావతిగా గుర్తించారు. వైద్యుల సూచన మేరకు పద్మావతిని మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. అయితే వీరిద్దరూ ఎందుకు విషం తాగారనేది తేలాల్సి ఉంది.

మాట ఇచ్చారు.. నెరవేర్చారు



సీఎం వైఎస్ జగన్ మంజూరు చేసిన రూ.13 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని చూపుతున్న నెల్లూరమ్మ

ఉరవకొండ: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ యువతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.13 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను యువతి తల్లిదండ్రులకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అందజేశారు. వివరాలు.. వజ్రకరూరు మండలం చాబాలకు చెందిన నెల్లూరమ్మ, వీరన్న దంపతుల కుమార్తె లక్ష్మి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి వారిని నేరుగా ఈ నెల 8న కళ్యాణదుర్గం వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదుట హాజరుపరిచి పరిస్థితి వివరించారు. స్పందించిన సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అప్పట్లో అందజేశారు. పింఛన్‌తో పాటు సొంతింటి నిర్మాణానికీ చర్యలూ తీసుకున్నారు. అనంతరం హైదరాబాద్‌లోని క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులను కలసి లక్ష్మి చికిత్సకు రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని తెలుసుకున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదికను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రూ.13 లక్షలు మంజూరు చేస్తూ సీఎం వైఎస్ జగన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను నేరుగా యువతి తల్లిదండ్రులకు ఎమ్మెల్సీ అందజేయడంతో వారు సీఎంతో పాటు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

గందరగోళంగా ఓటరు జాబితా

- పాపంపేట ఓటరు జాబితా తికమక
- ఒక కుటుంబంలో నాలుగు ఓట్లు ఉంటే... నాలుగూ ఒక్కో బూత్‌కు కేటాయింపు
- మొత్తం 17 బూత్‌ల ఓట్లలోనూ ఇదే పరిస్థితి



రాప్తాడురూరల్:

- అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో డోర్ నంబరు 4–1436లో దాదాపు 14 ఓట్లు ఉన్నాయి. నిబంధన మేరకు ఇవన్నీ ఒకే బూత్ పరిధిలోనే ఉండాలి. కానీ సుమారు 8 బూత్‌ల్లో ఉన్నాయి. ఎన్నిక సమయంలో ఏ పేరు ఏ బూత్‌తో ఉందో వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది.
- 78 పోలింగ్ స్టేషన్ ఓటరు జాబితా సీరియల్ నంబర్ 310లో శ్యామ్‌సుందర్ అనే వ్యక్తి పేరు ఉంది. ఈయన భార్య పేరు మాత్రం 73 పోలింగ్ స్టేసన్ ఓటరు జాబితా సీరియల్ నంబర్ 512లో ఉంది. అంటే భార్యాభర్తలిద్దరి పేర్లు వేర్వేరు బూత్‌లలో ఉన్నాయి.

అనంతపురం రూరల్ మండలం పాపంపేటలోని ఓటర్ల జాబితా గందరగోళంగా ఉంది. ఒకే కుటుంబంలోని సభ్యుల పేర్లు వేర్వేరు పోలింగ్ స్టేషన్ల జాబితాల్లో ఉన్నాయి. దీంతో చాలామంది విలువైన ఓటుహక్కును వినియోగించుకోకుండా నిరాశతో వెనుతిరిగే పరిస్థితి. అస్తవ్యస్త ఓటర్ల జాబితాను చూసి ఇంకొందరు పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లేందుకు కూడా ఆసక్తి చూపలేదు. ఫలితంగా ప్రతి ఎన్నికల్లోనూ ఈ ప్రాంతంలో ఓటింగ్ శాతం తగ్గుతోంది. పాపంపేట, విద్యారణ్యనగర్, రంగారెడ్డికాలనీ, బసవతారక నగర్, వీకేనగర్ తదితర ప్రాంతాలకు మొత్తం 17 బూత్‌లు కేటాయించారు. దాదాపు 17 వేల ఓట్లు ఉన్నాయి. బూత్ నంబర్ 68 నుంచి 84 వరకు ఈ ప్రాంతాలకు వస్తాయి.

సంబంధం లేని డోర్ నంబర్లు

1/1, 2/1, 3/1 సిరీస్‌తో మొదలయ్యే డోర్ నంబర్లు నారాయణపురం పంచాయతీ పరిధిలోని అర్బన్ నియోజకవర్గంలోని సోమనాథ్‌నగర్, తపోవనం ప్రాంతాలకు చెందిన ఓటర్లు. నిజానికి గ్రామ పంచాయతీ ఎన్నికలకు పాపంపేట, నారాయణపురం ఉమ్మడి పంచాయతీ. సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అనంతపురం అర్బన్ (పంచాయతీ పరిధిలోని)కు చెందిన ఓటర్లను, రాప్తాడు నియోజకవర్గం ఓటర్లను పంచాయతీ ఎన్నికల్లో ఒకే పంచాయతీ కింద చూపించారు. 4/,5/,6/,7/ సిరీస్‌తో ప్రారంభమయ్యే డోర్ నంబర్లన్నీ రాప్తాడు నియోజకవర్గంలోకి వస్తాయి. ఇందులో 6/కు సంబంధించి 6/100 నంబర్ల వరకు వస్తాయి. ఆ తర్వాత వచ్చే డోర్ నంబర్లన్నీ అర్బన్ నియోజకవర్గంలోకి వచ్చేవే.

తలనొప్పిగా మారిన ఓటరు జాబితా..

పాపంపేట పరిధిలో నాలుగు ఎంపీటీసీ 1,2,3,4 స్థానాలు ఉన్నాయి. సాధారణంగా ఒక్కో ఎంపీటీసీ సభ్యుడికి పరిధి ఉంటుంది. ఇక్కడ అలా లేదు. 1 ఎంపీటీసీ సభ్యుడికి తక్కిన మూడు ఎంపీటీసీల పరిధిలోని ఓటర్లు ఉన్నారు. తక్కిన ఎంపీటీసీల పరిస్థితి అదే. ప్రచారం కోసం వెళ్లాలంటే నలుగురూ అన్ని ప్రాంతాల్లోనూ తిరగాల్సిన పరిస్థితి. దీనిపై స్థానిక నాయకులు, ప్రజలు ఎన్నిమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు.

ఇలా చేస్తే ఓటింగ్ శాతం పెరిగే అవకాశం

డోర్ నంబర్ల వారీగా పోలింగ్ స్టేషన్లు కేటాయించగలిగితే ఒకే కుటుంబంలోని వారంతా కూడా ఒకే పీఎస్ పరిధిలోకి వస్తారు. దీంతో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. దీనికితోడు ఎంపీటీసీ స్థానాలు, వార్డు స్థానాలకు హద్దులు కూడా ఉంటాయి.

కలెక్టర్‌కు లేఖ రాసిన ఎమ్మెల్యే

పాపంపేటలో అస్తవ్యస్తంగా ఉన్న ఓటర్ల జాబితాను సవరించాలని కోరుతూ రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి 2020 జనవరి 8న కలెక్టర్‌కు లేఖ రాశారు. డోర్ నంబర్ల వారీగా పోలింగ్ స్టేషన్లు కేటాయించకుండా ఇష్టానుసారంగా కేటాయించారని లేఖలో పేర్కొన్నారు. తద్వారా నిరక్షరాస్యుల ఓటర్లకు తీవ్ర అసౌకర్యంగా మారిన ఈ జాబితాలను సవరించి పోలింగ్‌శాతం పెరిగేలా చూడాలని కోరారు.

ఇష్టారాజ్యంగా దోరు నంబర్లు



ఓటర్ల జాబితా చాలా గందరగోళందా ఉంది. డోర్‌నంబర్లు సీరియల్‌గా కాకుండా ఇష్టారాజ్యంగా దోరునంబర్లు తీసుకొని ఓటరు జాబితాల్లోకి ఎక్కించారు. దీంతో ఎంపీటీసీ సభ్యులకు ప్రత్యేకంగా ఒక పరిధి అంటూ లేదు. కొన్ని డోర్ నంబర్లు అయితే నాలుగు ఎంపీటీసీ స్థానాల ఓటర్ల జాబితాల్లోనూ ఉన్నాయి. ఇది చాలా ఇబ్బందికరంగా ఉంటోంది.

– సందీప్‌యాదవ్, ఎంపీటీసీ–1 పాపంపేట

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాపంపేట ప్రాంతంలో గందరగోళంగా ఉన్న ఓటర్ల జాబితా విషయాన్ని చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎవరూ పట్టించుకోలేదు. 17 బూత్‌లు ఉంటే ఒకే డోర్ నంబర్‌లోని ఓట్లు 5–6 బూత్‌లో ఉన్నాయి. దీంతో ఓటింగ్‌కు వెళ్లాలంటే కూడా చాలా మంది ఆసక్తి చూపలేదు. డోర్ నంబర్ల వారీగా ఓటర్ల జాబితాను తయారు చేస్తే ఓట్లు వేసేందుకు ఇబ్బంది ఉండదు.

– మతం శ్యాంసుందర్, జేసీఎస్ అనంతపురం మండల కన్వీనర్

పేదల సంక్షేమమే సీఎం ఆశయం



ఐదోరోడ్డు 'జగనన్న సురక్ష' సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- 'జగనన్న సురక్ష' సభలో ఎమ్మెల్యే అనంత

అనంతపురం క్రైం: నలభై ఏళ్లపాటు రాజకీయాల్లో ఉన్నానని, దేశంలో ఏ ముఖ్యమంత్రీ ఇంతటి సంక్షేమం, అభివృద్ధిని చేపట్టలేదని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఐదోరోడ్డు, సున్నంగేరి, ఆదర్శనగర్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇంకా కొందరు అర్హత ఉండి పథకాలకు నోచుకోలేదన్న విషయాన్ని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తెలుసుకొని, వాటిని జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. 23వేల మందికి సొంతింటి కల సాకారం చేసేందుకు ఇళ్ల పట్టాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లకు మంజూరు చేసిన (రూ.500 చెల్లించినవారు) 2,304 మందికి ఇళ్లు కేటాయించనున్నట్లు తెలిపారు. కామారుపల్లి లబ్ధిదారులకు కొడిమి, రాచానపల్లి, కురుగుంటలో ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని, అందుకోసం ప్రభుత్వం రూ.67 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, కార్పొరేటర్లు ఇస్హాక్, సైఫుల్లాబేగ్, రాజేశ్వరి, కమల్‌భూషణ్, బాబాఫక్రుద్దీన్, అబూసలేహా, నాయకులు కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి,సంక్షేమమే ధ్యేయం

అనంతపురం రూరల్: రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం ఏ నారాయణపురం, రుద్రంపేట పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై వివిధ రకాల సర్టిఫికెట్లు అందించారు. అనంతరం ఏ నారాయణపురం పంచాయతీలో ఆయుష్ భారత్ హెల్త్ సెంటర్, వైఎస్సార్ హెల్త్ సెంటర్, జగనన్న పాలవెల్లువ మహిళా డెయిరీ నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీలు మహబూబీ, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్‌వలి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణు, జగన్‌మోహన్‌రెడ్డి, బాషా, సత్యన్న, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారమే ధ్యేయం

అనంతపురం సిటీ: ముస్లిం మైనార్టీల సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా మసీదుల సందర్శనకు శ్రీకారం చుట్టినట్లు మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ నదీం అహమ్మద్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ తెలిపారు. అనంతపురం పాతూరులోని గఫూర్ కాలనీలో వెలసిన మసీద్–ఏ–మహమ్మదీయ మసీదులో 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సమాజు అనంతరం మతపెద్దలు, ముస్లింలతో వారు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యూనియన్ కామన్ సివిల్ కోడ్ (యూసీసీ)పై ముస్లిం మైనార్టీల్లో అనేక ఆందోళనలు, అపోహలు ఉన్న నేపథ్యంలో ఇటీవల అమరావతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ముస్లింమైనార్టీ ప్రతినిధుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల మనోభావాలు తెలుసుకున్నారన్నారు. అందుకనుగుణంనే తాను నడుచుకుంటానని హామీ ఇచ్చారన్నారు. మణిపూర్ దుర్ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిందేనని, ఇలాంటి చర్యలు సమాజానికి ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాకే హబీబుల్లా, మసీదు ముతవల్లి అబ్దుల్, ఇమామ్ సద్దాం తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

మణిపూర్ ఘటనకు కేంద్రం బాధ్యత వహించాలి

అనంతపురం అర్బన్: మణిపూర్ ఘటనకు కేంద్రం, ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహించాలని సీపీఐ, మహిళా సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మణిపూర్ ఘటనను ఖండిస్తూ స్థానిక టవర్ క్లాక్ వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడారు. మణిపూర్‌లో ఘటన సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా చేసిందన్నారు. మణిపూర్ అల్లర్లను, హింసాకాండను నియంత్రించడంలో కేంద్ర, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. రెండు నెలలకు పైగా అక్కడ ఘర్షణలు, హింసాకాండ చెలరేగుతుంటే, వాటికి అడ్డుకట్టవేయకపోవడం చూస్తుంటే వీటిని బీజేపీ ప్రభుత్వం ప్రేరేపిస్తున్నట్లుగా ఉందన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, పార్వతీప్రసాద్, రమణ, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ, మహిళా సమాఖ్య నాయకులు

చక్రధర్‌రావుకు డాక్టరేట్ ప్రదానం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగంలో పరిశోధన చేసిన టి. చక్రధర్‌రావుకు శనివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ కే రాంగోపాల్ పర్యవేక్షణలో ' ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ట్రోపోస్ఫెరిక్ ఏరోసోల్స్ ఓవర్ ద అరేబియన్ సీ– బయోజియో కెమికల్స్ ఎఫెక్ట్స్ 'అనే అంశంపై పరిశోధన చేశారు. పలు అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు. ఏరోసోల్ డేటాను సేకరించడానికి 2018లో ఒక నెల పాటు సముద్ర పరిశోధన వాహనం సాగర కన్య నౌకలో ప్రయాణించి, ప్రయోగాల్లో పాల్గొన్నారు. అరేబియా సముద్రంపై చేసిన పరిశోధనల ఆధారంగా, అరేబియా సముద్రం టోపోస్పియర్ బహుశా ప్రపంచంలో ప్రత్యేకమైన ప్రదేశం అని నిర్ధారించారు. ఇక్కడ మానవ నిర్మిత, సహజమైన ఏరోసోల్‌ల జాడలు రుతువుల మార్పులు గణనీయంగా కనిపిస్తాయి. ఇది దక్షిణాసియా ప్రధాన భూభాగం నుంచి అరేబియా ప్రధాన భూభాగం కాలుష్యం మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని గమనించడానికి ఇది ఒక ప్రత్యేకమైన సహజ ప్రయోగశాల. ధూళి ఏరోసోల్స్ నిక్షేపణలో తగ్గదలతో అరేబియా సముద్రంపై నికర ప్రాథమిక ఉత్పాదకత తగ్గుతుందని పరిశోధనల్లో కనుగొన్నారు. ఈ సందర్భంగా చక్రధర్‌రావు పరిశోధనలపై సంతృప్తి చెందిన ప్రొఫెసర్ కే రాంగోపాల్ అభినందించారు.



చక్రధర్ రావు

నెల్లూరు, కడప జట్ల విజయం

అనంతపురం: అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ జోన్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కర్నూలు–నెల్లూరు, కడప– చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు, కడప జట్లు విజయం సాధించాయి. తొలుత కర్నూలు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. వరుసగా 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న జట్టును కరణ్‌షిండే 141 బంతుల్లో 107 పరుగులు (11ఫోర్లు, 2 సిక్సర్లు) చేసి ఆదుకున్నాడు. మొత్తం 45 ఓవర్లలో 168 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 5 వికెట్ల తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది. పి. సుబ్రమణ్యం 95 పరుగులు , షేక్‌అబ్బాస్ 34 పరుగులు చేయడంతో జట్టు సునాయసంగా గెలుపొందింది.

ఆతర్వాత మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 47 ఓవర్లలో మొత్తం 263 పరుగులు చేసింది. టి. వంశీ కృష్ణ 105 పరుగులు, ధ్రువకుమార్ రెడ్డి 46 పరుగులు చేసి జట్టుకు మంచి స్కోరు అందించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన చిత్తూరు 41 ఓవర్లలో 187 పరుగులు చేసింది. వర్షం కారణంగా వీజేడీ విధానంలో 65 పరుగుల తేడాతో కడప జట్టు గెలిచినట్లు ప్రకటించారు.


కంబైన్డ్ -11 జట్టు గెలుపు:

అండర్–19 బాలికల అండర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శనివారం అనంతపురం–కంబైన్డ్–11 (నెల్లూరు, కడప) మ్యాచ్ నిర్వహించగా, కంబైన్డ్–11 జట్టు గెలుపొందింది. అనంతపురం తొలుత బ్యాటింగ్ చేయగా, 50 ఓవర్లకుగాను 269 పరుగులు చేసింది. బి. నేహా 157 బంతుల్లో 175 పరుగులు (23 ఫోర్లు) అద్వితీయమైన ప్రతిభ చాటింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కంబైన్డ్–11 , 28.3 ఓవర్లలోనే 166 పరుగులు చేసింది. వర్షం కారణంగా వీజేడీ విధానంలో కంబైన్డ్ -11 జట్టు గెలిచినట్లు ప్రకటించారు.

వరద సమయంలో వారధులు..



అనంతపురం క్రైం : గతేడాది అక్టోబర్‌లో కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో నడిమివంక పొంగి పొర్లింది. నడిమివంకకు ఆనుకొని ఉన్న ఐదోరోడ్డు, యువజన కాలనీ, హనుమాన్‌కాలనీ, గౌరవగార్డెన్స్, వడ్డే వారి కాలనీ, తదితర ప్రాంతాల్లో వరద పోటెత్తింది. ఇళ్లలోకి నీరు రావడంతో వేల సంఖ్యలో ప్రజానీకాన్ని పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు వారికి ఆహారం అందించడంలో వలంటీర్లు ప్రజలకు వారధుల్లా పనిచేశారు. నగరంలోని 62వ సచివాలయ పరిధిలోని ఐదో రోడ్డును వరద చుట్టుముట్టింది. ఈ సమయంలో వలంటీర్ కీర్తన ముంపు ప్రాంతాల్లో ఉన్న బాధితులకు ఆహార పొట్లాలు అందించి, ఆకలితీర్చింది. ఎప్పటికప్పుడు వారి సమాచారాన్ని సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి అందరితోనూ శభాష్ అనిపించుకుంది.



వరదలో ఆహార పొట్లాలను తీసుకెళ్తున్న కీర్తన (పసుపురంగు చుడీదార్)

కుటుంబ సభ్యురాలిలా సేవలు



ప్రజా అవసరాలను గుర్తించి, ప్రతి సమాచారాన్ని వలంటీర్ కీర్తన ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది. అమ్మఒడి పథకం వర్తింపజేయడానికి అన్ని రకాల సర్టిఫికెట్లను తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడించింది. ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేస్తుంది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా సర్టిఫికెట్లు వస్తాయని కీర్తన, సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి చెప్పింది. కీర్తన మా అందరికీ కుటుంబ సభ్యురాలిలా సేవలందిస్తోంది.

– అశ్వర్థ నారాయణ, ఐదోరోడ్డు, అనంతపురం

బీరు బాటిల్‌తో స్నేహితుడిపై దాడి

రాప్తాడురూరల్: మద్యం కోసం స్నేహితుడిపై బీరు బాటిల్‌తో దాడి చేసిన ఘటన అనంతపురం రూరల్ మండలం పాములరాయి సమీపంలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరానికి చెందిన దిలీప్‌కుమార్, పాములరాయికి చెందిన సురేష్ స్నేహితులు. వీరి స్నేహితుడు మృతి చెందడంతో చూసేందుకని దిలీప్‌కుమార్ అనంతపురం వచ్చాడు. ఈ క్రమంలో వీరిద్దరూ మరికొందరితో కలిసి టాటా షోరూం సమీపంలో మద్యం తాగుతున్నారు. గ్లాసులో పోసిన మద్యం తాగావు ఒకరంటే..లేదు నువ్వే తాగావు అని దిలీప్‌కుమార్, సురేష్ వాదించుకున్నారు. ఈక్రమంలో సురేష్ బీరు బాటిల్‌తో దాడి చేయగా...దిలీప్‌కుమార్ మొహంపై గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లింగమయ్య



అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సి.లింగమయ్య ఎన్నికయ్యారు. ఈనెల 21న అనంతపురంలో జరిగిన సమాఖ్య రాష్ట్ర సదస్సుల్లో రాష్ట్ర కమిటీని ఎన్నిక చేశారని ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బుద్ధారపు వెంకట్రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు.

మణిపూర్ హింసపై నేడు కవి సమ్మేళనం

అనంతపురం కల్చరల్: 'మణిపూర్ హింస– ప్రతిఘటన కలాలు' అనే అంశంపై ఆదివారం ఉదయం 10 గంటలకు ఆర్ట్స్ కళాశాలలోని రూం నంబర్–9లో కవి సమ్మేళనం ఉంటుందని జిల్లా రచయితల సంఘం నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు.

రిజిస్ట్రార్‌కు అభినందనలు



రిజిస్ట్రార్‌కు అభినందనలు తెలుపుతున్న కాంట్రాక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య పదవీ కాలం ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. వర్సిటీలో పాలన సమర్థవంతంగా, అంకితభావంతో నిర్వర్తించి, అందరి మన్ననలూ పొందారని బోధనేతర ఉద్యోగులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఎల్లప్ప, వెంకటస్వామి, శ్రీనివాస రెడ్డి, మల్లికార్జున రెడ్డి, జగదీశ్వర రెడ్డి పాల్గొన్నారు.

- ఎస్కేయూ 21వ స్నాతకోత్సవాన్ని దిగ్విజయంగా నిర్వహించినందుకు వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డికి ఉద్యోగులు అభినందనలు తెలిపారు. బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.


ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎంపీపీ హేమలత తెలిపారు. శనివారం మండలంలోని పంపనూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ , ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి, సర్పంచులు ఎ త్రిస్వామి, చంద్రశేఖర్, వెంకటేష్‌నాయక్, వైస్ ఎంపీపీ విజయ్ , జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, మాజీ సర్పంచ్‌లు వన్నూరప్ప, బాలా నాయక్, నాయకులు ఫణిరెడ్డి, అతికిరెడ్డి, అంజినప్ప, అశోక్ , మురళి పాల్గొన్నారు.

ఉచితంగా సేవలు

రాప్తాడు: 'జగనన్న సురక్ష' ద్వారా ప్రభుత్వ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం బొమ్మేపర్తిలో ఎంపీడీఓ సాల్మన్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గతంలో ఒక సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే దుస్థితి ఉండేదన్నారు. నేడు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఆపరిస్థితిలేదన్నారు. తహసీల్దార్ లక్ష్మీ నరసింహ, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ కన్వీనర్ సత్యనారా యణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నేత్రపర్వం.. ఏడు శనివారాల వ్రతం



అలంకరణలో వెంకటేశ్వరస్వామి

అనంతపురం కల్చరల్: భగవంతుడికి ప్రీతిపాత్రమైన ఏడు శనివారాల వ్రతాలు నేత్రపర్వంగా జరిగాయి. శనివారం స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో పోటెత్తింది. వందలాదిమంది మహిళలు ఏకరూప దుస్తులతో వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఆలయం దేదీప్యమానంగా వెలిగిపోయింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడికి ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.



ఆర్ఎఫ్ రోడ్డులోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతం ఆచరిస్తున్న భక్తులు



పూజలు చేస్తున్న అర్చకులు

క్లుప్తంగా

అభ్యంతరాలుంటే తెలియజేయండి



చిన్మయనగర్‌లో ఇంటింటా సర్వే చేస్తున్న అధికారులు, బీఎల్ఓలు

రాప్తాడు: ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేయాలని తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఈడీటీ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో ఓటరు జాబితాపై బీఎల్ఓలు ఇంటింటా సర్వే చేపట్టారు. వారు మాట్లాడుతూ కొత్త ఓటరు జాబితాలతో ఆగస్టు 21 వరకు ప్రతి ఇంటికీ బీఎల్ఓలు వస్తారని, ఓటర్లు తమ పేర్లు, ఆధార్ నంబర్లు, ఇంటి పేర్లు తదితర వివరాలు జాబితాలో సరిగా ఉన్నవీ లేనిదీ సరి చూసుకోవాలన్నారు.

నేడు బీఎస్ రావు సంతాప సభ

రాప్తాడురూరల్: శ్రీచైతన్య విద్యా సంస్థల ఫౌండర్, దివంగత డాక్టర్ బీఎస్ రావు సంతాప సభను ఆదివారం ఉదయం 10 గంటలకు అనంతపురం గుత్తిరోడ్డులోని బల్లా కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేస్తున్నట్లు చైతన్య పాఠశాలల అనంతపురం జోన్ ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యా సంస్థల ఏర్పాటుతో వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ లక్షలాది మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించిన బీఎస్ రావు ఇటీవల మృతి చెందారని గుర్తు చేశారు. ఆయన స్మృతులను గుర్తు చేసుకునేందుకు సంతాప సభ ఏర్పాటు చేసినట్లు సుబ్బారెడ్డి తెలిపారు.

ఏడీని కలిసిన పీఆర్‌టీయూ నాయకులు



ఏడీ నాగరాజుకు డైరీ అందిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.నాగరాజును శనివారం పీఆర్టీయూ నాయకులు కలిసి చర్చించారు. కొత్తగా జిల్లాకు వచ్చిన ఏడీకి ముందుగా సంఘం డైరీని అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జిల్లాలో పూర్తిగా సహకరం అందిస్తామన్నారు. పీఆర్టీయూ నాయకులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, టి.చంద్రశేఖర్‌రెడ్డి, టి.పురుషోత్తంరెడ్డి, లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.

టమాటాల కొనుగోలుకు బారులుదీరిన జనం



టమాటాలు కొనుగోలు చేస్తున్న జనం

అనంతపురం అగ్రికల్చర్: ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానిక రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన రాయితీ టమాటాల విక్రయ కేంద్రానికి స్పందన లభించింది. శనివారం కూడా ఎస్టేట్ అధికారి ప్రతాప్, సూపర్‌వైజర్ లోకేష్ ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒకటిన్నర టన్ను టమాటాల విక్రయాలు జరిగాయి. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.100 దాకా ఉండటంతో రైతుబజార్‌లో కిలో రూ.50 ప్రకారం ఒక్కొక్కరికి రెండు కిలోలు మేర విక్రయిస్తున్నారు. దీంతో నగరవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రోజు మార్చి రోజు టమాటాలు విక్రయాలు ఉంటాయని, ఆదివారం సెలవు ఉంటుందని, సోమవారం యథావిధిగా పంపిణీ చేస్తామని తెలిపారు.

'ఎరా ఇంటర్నేషనల్ స్కూల్'పై చర్యలు తీసుకోండి



ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం రూరల్: నిబంధనలకు విరుద్ధంగా రూ.లక్షలు ఫీజుల రూపంలో వసూ చేస్తున్న ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ గేట్ ఎదుట నిరసన తెలియజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుళ్లాయిస్వామి, జిల్లా కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యం నిబంధనలను తుంగలోకి తొక్కి విద్యార్థుల తల్లిదండ్రులతో అధిక ఫీజులు వసూలు చేస్తోందన్నారు. సమయానికి ఫీజులు చెల్లించకపోతే వడ్డీతో సహా చెల్లించాలని విద్యార్థులు తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నట్లు విమర్శించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమా మహేష్, ఆనంద్, వంశీ, యశ్వంత్ కృష్ణ, జగదీష్, సుధాకర్, విష్ణు, కార్తీక్ బాబు తదితరులు పాల్గొన్నారు.